కొత్త పార్కులొస్తున్నాయ్..!


బక్కన్నపాలెం నారాయణ రెడ్డి లే అవుట్‌లో పార్కు నిర్మాణ పనులు


బోయిపాలెం వద్ద పార్కు నిర్మాణ పనుల్లో కార్మికులు

- జోన్‌-2లో 7 వార్డుల్లో 11 పార్కులు
- 2.74 కోట్లతో పలు చోట్ల పనులు ప్రారంభం

మధురవాడ: నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో పార్కుల అభివృద్ధికి, పార్కు స్థలాలు పరిరక్షణకు ఎంత ప్రాధాన్యత ఉందో వేరే చెప్పవలసిన అవసరం లేదు. పైగా ఇవి ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించడంలో అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అందుకే పార్కులు అభివృద్ధిని ప్రభుత్వ నిరంతర ప్రక్రియగా చేపడుతోంది. కొద్ది నెలలు క్రితం పీఎంపాలెం లాస్ట్ బస్టాప్ వద్ద యోగా థీమ్ పార్కు, బక్కన్నపాలెం లచ్చిరాజు లే అవుట్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కు, మధురవాడ జాతీయ రహదారిని అనుకుని ఎంఎస్‌ఆర్ లే అవుట్ వద్ద బట్టర్ ఫ్లై థీమ్ పార్కు, రుషికొండ వైఎల్‌పీ లే అవుట్‌లో ఫామ్ గార్డెన్ థీమ్ పార్కులను రు. 6.80 కోట్లతో అభివృద్ధి చేశారు. అలాగే స్వతంత్ర నగర్‌లో రు.2.50 కోట్లు, వాంబేకాలనీ, పీఎంపాలెం, వుడా కాలనీ, బింద్రానగర్ తదితర ప్రాంతాల్లో మరో రూ.5కోట్ల వరకు పార్కుల అభివృద్ధికి ఖర్చు చేశారు. ఇవన్నీ అందుబాటులోకి వచ్చేశాయి. ఇప్పుడు తాజాగా మధురవాడ జోనల్‌లోని 5, 6, 7, 10, 11, 12, 13 వార్డుల్లో 11 పార్కులు అభివృద్ధికి రు. 2.74 కోట్లు ఖర్చు చేస్తోంది. ఒక్క మధురవాడ జోన్‌లోనే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15 కోట్లకు పైనే ఖర్చు చేశారు. అంటే ప్రభుత్వం పార్కులకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ఇట్టే అర్థమవుతోంది.


పార్కులో పనులు చేస్తున్న కార్మికులు


ఆర్‌టీసీ కాలనీ వద్ద చిల్డ్రన్ పార్కు

జోన్‌లో పనులు జరుగుతున్న పార్కుల వివరాలు

వార్డు	ఏరియా	పార్కుల్లో పనులు	ఖర్చు మొత్తం (లక్షల్లో)
5	బోయిపాలెం వద్ద	వాకింగ్ ట్రాక్, జిమ్ సామగ్రి పిల్లల ఆట సామగ్రి, బెంచీలు	రూ.18.10
5	ఓజోన్ వ్యాలి	ప్రహరి, ల్యాండ్ స్కేపింగ్	రూ. 18.70
5	నగరంపాలెం	వాకింగ్ ట్రాక్, బెంచెలు, జిమ్, బెంచీలు, పిల్ల ఆట సామగ్రి	రూ.17.60
6	ఓజోన్ వ్యాలి	వాకింగ్ ట్రాక్, జిమ్, బెంచీలు, పిల్ల ఆట సామగ్రి	రూ.16.50
6	బక్కన్నపాలెం నారాయణరెడ్డి లే అవుట్	వాకింగ్ ట్రాక్, జిమ్, బెంచీలు, పిల్ల ఆట సామగ్రి	రూ. 18.70
7	ఎజీజీవోస్ కాలనీ	వాకింగ్ ట్రాక్, జిమ్, బెంచీలు, వాంబే కాలనీ డబుల్ రోడ్డు వద పిల్ల ఆట సామగ్రి	రూ.19.10
7	ఆర్‌టీసీ కాలనీ	వాకింగ్ ట్రాక్, జిమ్, బెంచీలు, పిల్ల ఆట సామగ్రి	రూ.19.75
10	వెటర్నరీ కాలనీ	యోగా స్టేజీ, మట్టి వాకింగ్ ట్రాక్, బెంచీలు, జిమ్, ఈపీడీఎమ్ ఫ్లోరింగ్‌తో చిల్డ్రన్ ఆటసామగ్రి, కరెంటు సప్లయ్	రూ.32.25
11	తోట గరువు	యోగా స్టేజీ, మట్టి వాకింగ్ ట్రాక్, బెంచీలు, జిమ్, ఈపీడీఎం ఫ్లోరింగ్‌తో చిల్డ్రన్ ఆట సామగ్రి, కరెంటు సప్లయ్	రూ.30.44
12	శ్రీకాంత్‌నగర్	యోగా స్టేజీ, మట్టి వాకింగ్ ట్రాక్, బెంచీలు, జిమ్, ఈపీడీఎం ఫ్లోరింగ్‌తో చిల్డ్రన్ ఆట సామగ్రి, కరెంటు సప్లయ్ చినగదిలి రీహేబిటేషన్ కాలనీ	రూ. 49.39
13	ఆరిలోవ ఎంపీపీ స్కూల్ దగ్గర	యోగా స్టేజీ, మట్టి వాకింగ్ ట్రాక్, బెంచీలు, జిమ్, ఈపీడీఎం ఫ్లోరింగ్‌తో చిల్డ్రన్ ఆట సామగ్రి, కరెంటు సప్లయ్	రూ.33.85

క్లుప్తంగా

వైభవంగా స్నపన తిరుమంజనం


ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రామాలయంలో అన్నదానం


జ్యూట్ మిల్లు రామాలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానాన్ని చిట్టివలసకు చెందిన కాళ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, ఉప్పల రమేష్‌బాబు, మేకల శ్రీనివాస్, సైలాడ మల్లిబాబు, అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకుడు రవిగణేష్ మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో అన్నదానం జరుపుతున్నట్టు తెలిపారు. జూన్ ఒకటిన హనుమత్ జయంతి సందర్భంగా భారీగా అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు


లా కళాశాల రోడ్డు వద్ద సీఐటీయూ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

మధురవాడ : వచ్చే ప్రభుత్వం హయాంలో నైనా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, జీవో నంబర్ 21 రద్దుచేయాలని సీఐటీయూ ఆటో రిక్షాకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. రాజ్‌కుమార్ అన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడలోని పలు చోట్ల పతాకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న చట్టాలు వలన రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ పన్నులు వేయడం మరింత భారంగా మారిందన్నారు. యండాడ లా కళాశాల వద్ద స్టాండ్ అధ్యక్షుడు సూరిబాబు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు చిన్న, రాము, అంజి, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల రౌండ్ టేబుల్ సమావేశం నేడు

బీచ్ రోడ్డు: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల చైతన్య సదస్సు ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారులు, భవనాల సంఘం చైర్మన్ రామ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మహారాణిపేటలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ పక్కన ఉన్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సాయంత్రం 5 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

దివీస్ చాలెంజర్స్ ట్రోఫీ మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

తగరపువలస : భీమిలి మండలం పాత మూలకుద్దులో దివీస్ చాలెంజర్స్ ట్రోఫీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆ సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ప్రారంభమైన ఈ చాలెంజర్స్ ట్రోఫీ కరోనా కారణంగా మూడేళ్ల విరామం అనంతరం మళ్లీ ప్రారంభించినట్టు తెలిపారు. 12 పంచాయతీల నుంచి 32 జట్లు ఇందులో తలపడనున్నాయన్నారు. గ్రూప్‌నకు నాలుగు జట్లు వంతున ఎనిమిది గ్రూప్‌లుగా లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25వేలుగా నిర్వహకులు ప్రకటించారు. అనంతరం ఆయన చేతులు మీదుగా క్రీడాకారులకు జెర్సీలు, క్యాప్‌లు, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. నెలరోజుల పాటు జరగనున్న ఈ క్రికెట్ పోటీలకు రూ.25 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా దివీస్ చాలెంజర్స్ ట్రోఫీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీజీఎం పి.ప్రభాకర్, సీనియర్ మేనేజర్ గోపీనాథ్, సీఎస్సార్ మేనేజర్ సురేష్, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్‌బాబు, పైడినాయుడు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీ ప్రారంభంలో క్రీడాకారులతో దివీస్ యాజమాన్యం

దివ్యాంగ పిల్లలకు భరోసాగా భవిత కేంద్రాలు


పద్మనాభంలో దివ్యాంగ బాలుడితో మాట్లాడుతున్న ఎంఈవో రమణ

పద్మనాభం: దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని ఎంఈవో పొన్నగంటి రమణ అన్నారు. పద్మనాభం గ్రామంలో గురువారం బడి బయట ఉన్న 18 ఏళ్ల లోపు దివ్యాంగులను గుర్తింపునకు ఆయన ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, హెచ్.రాజ్‌కుమార్ కలిసి సర్వే చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడారు. భవిత కేంద్రాలకు పంపించే దివ్యాంగ పిల్లలకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా చదువు నేర్పడంతో పాటు ప్రభుత్వం ఫిజియోథెరపి చేయిస్తుందన్నారు. దివ్యాంగ పిల్లలు ఇతరులపై ఆధారపడకుండా తమ పనులు తాము చేసుకునేలా భవిత కేంద్రంలో ఉన్న పరికరాల ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. తల్లి దండ్రులు సాధారణ పిల్లలతో పాటు దివ్యాంగులను కూడా బడికి పంపించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

పచ్చి రొట్టతో భూసారం పెంపు

పద్మనాభం: పచ్చి రొట్ట ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస, కోరాడ, రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ భూములకు పచ్చి రొట్ట ఎరువులు వేయడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరిగి సారవంతమవుతుందని తెలిపారు. నీటి సదుపాయమున్న రైతులందరూ పచ్చి రొట్ట విత్తనాలు వేయాలన్నారు. రైతులతో పచ్చి రొట్ట విత్తనాలు వేయించేందుకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే వరి విత్తనాలు జూన్ మొదటి వారంలో రైతు భరోసా కేంద్రాలకు వచ్చేటట్లు చేస్తామన్నారు. రెడ్డిపల్లిలో ఎరువుల షాపును తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం పాల్గొన్నారు.


రెడ్డిపల్లి ఎరువుల షాపులో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అప్పలస్వామి

పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

పీఎంపాలెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తిపై పీఎం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మారికవలస రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో భర్తనుంచి విడాకులు తీసుకున్న హేమలత నివసిస్తోంది. ఆమెకు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ఇందిరానగర్‌కు చెందిన కొండోజు ప్రణయ్ కుమార్ అనే వ్యక్తితో డైవర్స్ యాప్ ద్వారా పరిచయమేర్పడింది. తనకు చాలా ఆస్తులు ఉన్నాయని తనను వివాహం చేసుకుంటే జాయింట్ రిజిస్ట్రేషన్ చేయిస్తాయిస్తానని నమ్మబలికాడు. వివిధ కారణాలు చూపుతూ సుమారు రూ.8 లక్షలు తన పేరున బదిలీ చేయించుకున్నాడు. ఎలాగూ పెళ్లి చేసుకుంటామని కాకమ్మ కబర్లు చెబుతూ తరచూ విశాఖ వచ్చి ఆమెతో సహజీవనం చేసేవాడు. ఇలా కొన్నాళ్లు గడిచింది. తరువాత అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. వివాహ ప్రతిపాదనను తీసుకు వస్తే దాట వేసేవాడు. గట్టిగా అడిగేసరికి పెళ్లి చేసుకునేది లేదని తిరస్కరించాడు. తరువాత పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కేసులో నిందితుడు ప్రణయ్ కుమార్ అని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందని సీఐ రామకృష్ణ తెలిపారు.

క్రమశిక్షణతోనే రాణింపు



బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులైన విద్యార్థులు

పీఎంపాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రభూషణ్ రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి 35 అనుబంధ కళాశాలలు ఉండగా బిట్స్ 10వ కళాశాలగా పేర్కొన్నారు. విద్యార్థులు మూడు విషయాల్లో క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. టైమ్ మేనేజ్‌మెంట్ , ఆరోగ్య పరిరక్షణ, నైపుణ్యం పెంపొందించుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ఆయన పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు సంయమనం పాటించి సహనంతో మెలగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీ. పూర్ణసత్యనారాయణ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జాషువారాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎంపాలెం: స్థానిక వైఎస్సార్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సప్తగిరి విద్యుత్ ఫీడర్, 11 కేవీ ధర్మపురి విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ పైన పేర్కొన్న విద్యుత్ ఫీడర్ల ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విశాఖ ఆపరేషన్ జోన్‌-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ధర్మపురికాలనీ, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక ప్రాంతం, తారాకరామా నగర్, బింద్రానగర్, పీర్‌లెస్‌కాలనీ, డైమెన్షన్ పిజ్జా తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

తగరపువలసలో..

తగరపువలస : 33/11 కేవీ చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ తగరపువలస ఫీడర్‌పై నిర్వహణ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖ ఆపరేషన్ జోన్‌-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. కొండపేట, పంప్‌హౌస్ లైన్, చిట్టివలస జ్యూట్‌మిల్లు క్వార్టర్స్, సంతపేట, గణేష్ థియేటర్ రోడ్డు, ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పర్యావరణ మార్పులపై సెప్టెంబర్‌లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాతావరణ మార్పు అధ్యయనాలకు సంబంధించి వాతావరణ సముద్ర ప్రక్రియల్లో ప్రస్తుత పోకడలు అంశంపై జాతీయ సదస్సును సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం సెప్టెంబర్‌లో ప్లాటినం జూబ్లీ వేడుకలను జరుపుకోనుంది. దీనిలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య పి.సునీత, బీవోఎస్ చైర్మన్ ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య ఒ.ఎస్.ఆర్. భానుకుమార్, ఆచార్య విఠల్ మూర్తి, డాక్టర్ ఆర్.ఆర్.రావు, డాక్టర్ సి.వి.కె.ప్రసాదరావు, డాక్టర్ వి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ కె.సోమసుందర్ పాల్గొన్నారు.

వృక్షో రక్షతి రక్షితః

బాటసారులకు సేద తీరుస్తున్న భారీ వృక్షాలు


నూకాలమ్మవారి ఆలయం వద్ద ఉన్న భారీ వృక్షం


లైట్‌హౌస్ ఎదురుగా పావురాల పార్కులో ఉన్న వృక్షం

భీమునిపట్నం: వేసవి ఎండలు మండిపోతున్న తరుణంలో బాటసారులకు నేనున్నాంటూ భారీ వృక్షాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. రెండు చోట్ల ఉన్న భారీ వృక్షాల నీడలు జనం సేద తీరుస్తున్నాయి. భీమిలి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మవారి ఆలయం వద్ద ఎన్నో ఏళ్లుగా భారీ మర్రి వృక్షం ఉంది. ఇది నలువైపులా బాగా విస్తరించి నీడనిస్తోంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు దీని కింద సేద తీరుతారు. అలాగే దీని పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా నిత్యం అక్కడకు వచ్చేవారికి కూడా ఇది ఎంతో ఉపయోగపడుతోంది. బయట ఎంత వేడిగా ఉన్నా ఈ చెట్టుకిందకు చేరితో చల్లదనాన్ని ఆస్వాదించొచ్చు. అదేవిధంగా బీచ్ వద్ద లైట్‌హౌస్ ఎదురుగా ఉన్న పావురాల పార్కులో కూడా మర్రి వృక్షంతో పాటు, బాదం చెట్టు ఉంది. ఈ చుట్టుపక్కల ఎక్కడ నీడ సదుపాయం లేదు. దీంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇక్కడ సేదతీరడంతోపాటు, భోజనాలు చేస్తుంటారు. ఇలా ఈ భారీ వృక్షాలు ఊరి మధ్యలో జనానికి నీడనిస్తున్నాయి.



అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం




టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

పరారీలో టీడీపీ నాయకుడు

భీమునిపట్నం: అక్రమంగా బాణసంచా తయారు చేసి ఓ రేకుల షెడ్డులో నిల్వ చేయగా విశాఖ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, భీమిలి పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. భీమిలిలోని తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకుడు కొక్కిరి అప్పన్న తాళ్లవలస సమీపంలోని అక్కరమాని చిన్నమ్మకు చెందిన ఇంటి వెనుక భాగంలో ఉన్న ఒక రేకుల షెడ్డును కొద్ది నెలల క్రితం అద్దెకు తీసుకున్నాడు. ఇందులో పెద్ద ఎత్తున బాణసంచా తయారు చేసి అక్కడ నిల్వ చేశాడు. టాస్క్ ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు, భీమిలి సీ.ఐ.రమేష్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి రూ.లక్ష విలువ చేసే బాంబులు, జువ్వలు, బెల్టుబాంబులు, షాట్స్‌తోపాటు మరికొంత బాణసంచా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు, నిందితుడు అప్పన్న పరారీలో ఉన్నాడు. గతంలోకూడా బాణసంచా అక్రమ నిల్వలపై అప్పన్నపై కేసు నమోదైంది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు

ఏయూ క్యాంపస్: స్వశక్తితో ఎదిగే యువ పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు ఉంటున్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ శాలిని మీనన్ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో రోటరీ క్లబ్ విశాఖపట్నం 3020, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్, యూబీఐ సంయుక్తంగా యువ పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రవ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించే వారికి అనేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఎంఎస్ఎంఈల ద్వారా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఆర్.టి.ఎస్.డి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీలారాణి, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రమౌళి, ఎస్ఆర్‌డీసీ రీజినల్ మేనేజర్ బి.కె.సాహు, ఉపేంద్ర శ్రీనివాస్, రోటరీ క్లబ్ విశాఖపట్నం కార్యదర్శి పి.వి.రఘుపతి, పెద్ద సంఖ్యలో యువ పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కాగా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే


సర్వేలో పాల్గొన్న సహిత విద్య కో-ఆర్డినేటర్ గీత, ఎంఈవో రామారావు

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లాలో చేపడుతున్న సర్వేపై శ్రద్ధ తీసుకోవాలని సహిత విద్య కో-ఆర్డినేటర్ గీత కోరారు. ఐఈఆర్పీలు చేపడుతున్న సర్వేను గురువారం నగరంలో ఆమె పరిశీలించారు. సీతమ్మధార మండలంలోని శ్రీనివాసనగర్ నిర్వహిస్తున్న సర్వేలో ఎంఈవో రామారావుతో కలసి ఆమె పాల్గొన్నారు. భవిత టీచర్లు జగదాంబ, శారద ఇంటింటికీ గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో చర్పించేలా వారికి అక్కడికక్కడే అడ్మిషన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా సర్వేలో నమోదై ఉండాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, సర్వేను విజయవంతం చేయాలని ఐఈఆర్పీలకు సూచించారు.